క్లుప్తంగా

30న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఈ నెల 30న మంగళవారం ఉదయం మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన జరిగే సమావేశంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పేరలి(కర్లపాలెం): యువకులంతా ఐకమత్యంగా క్రికెట్ టోర్నమెంటును నిర్వహించుకోవటం అభినందనీయమని పేరలి సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు(ఆదాం) అన్నారు. గ్రామంలో మేకల విజయభాస్కర్ స్మారకంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును శనివారం సర్పంచ్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులంతా క్రీడా స్ఫూర్తితో క్రికెట్ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సలగల ధర్మేంద్ర, గ్రామపెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం

గుదిబండివారిపాలెం(కొల్లిపర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ సంచాలకులు, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం(సమ్మర్ క్యాంప్)లు నిర్వహిస్తున్నట్లు కొల్లిపర శాఖా గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు తెలిపారు. శనివారం గుదిబండివారిపాలెం శాఖా గ్రంథాలయంలో ఆయన సమ్మర్ క్యాంప్ వివరాలు వెల్లడించారు.1 నుంచి 7వ తరగతి వరకు చదివే విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, స్టోరీ టెల్లింగ్, పేపరు క్రాఫ్ట్ ఆర్ట్, మ్యూజికల్ డ్యాన్స్, క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ మొదలగు వాటిని నేర్పించటం, చదివించటం జరుగుతుందన్నారు. క్యాంప్ ఆఖరి రోజున వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. వేసవిలో ఇంటి దగ్గర ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మే 2 నుంచి బైబిల్ స్కూల్ తరగతులు

తెనాలిఅర్బన్: టీవోజీ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మే 2, 3, 4 తేదీల్లో వెకేషన్ బైబిల్ స్కూల్ ఉచిత తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అత్తోట హేమలత, అత్తోట ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని చెప్పారు. బైబిల్‌కు సంబంధించిన పాటలు, స్కిట్‌లు, గేమ్స్, తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని దయమణి జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో తరగతులు జరగనున్నట్లు వివరించారు. చిన్నారులు, యువకులు పాల్గొనాలని కోరారు.

'కళ్లం' అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులతోపాటు అధ్యాపకులకు ఉజ్వల భవిష్యత్తు, లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమా శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అధ్యాపకురాలి అభినందన కార్యక్రమం నిర్వహించారు. తమ కళాశాల అధ్యాపకురాలు బి.బిందుమాధవికి జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని తెలిపారు. డిగ్రీ ఇన్ ది కాంటెంపరరీ ఇండియన్ ఇంగ్లీష్ లిటరేచర్ అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ పి.అపర్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

పెదకాకాని: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలసులు శనివారం తెలిపారు. పెదకాకాని పోలీసు స్టేషన్ పరిధిలోని మెహర్ బాబా టెంపుల్, ఒమేగా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన వువ్వాడ ఈశ్వరమ్మ ఈ నెల 24న అలిగి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. మరలా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులకు సమాచారం అందించినప్పటికీ ఎటువంటి ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త రాంబాబు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహిళ అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

29 నుంచి వేసవి శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: ఏటుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయం అధికారిణి పి.పరమేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కథలు చెప్పటం, కథలు చెప్పించటం, చిత్రలేఖనం, ఆటలు తదితరాలపై శిక్షణనివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్ సీపీలో కాపులకు సముచిత స్థానం

- కాపు సామాజిక వర్గానికి అత్యధికంగా ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించిన సీఎం వైఎస్ జగన్
- టీడీపీ ఎన్ని సీట్లు కేటాయించిందో బహిర్గతం చేయాలి
- వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



పెరవలిపాలెంలో పార్టీ నాయకులతో సమావేశమైన వరికూటి అశోక్‌బాబు

పెరవలి పాలెం(వేమూరు): వైఎస్సార్ సీపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు విష్ణుమొలకల వెంకటరెడ్డి స్వగృహంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరవలిపాలెం గ్రామంలో కాపు సామాజికవర్గం ప్రజలు ఎక్కువగా ఉన్నారన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు కాపు సామాజిక వర్గం ప్రజలకు చేసిన మేలు ఏమిటిని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు సామాజిక వర్గం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు సామాజిక వర్గానికి చెందిన 32 మందికి ఎమ్మెల్యేల సీట్లు ఇవ్వడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ కాపులకు ఎమ్మెల్యే సీట్లు ఎన్ని ఇచ్చిందో ఆ పార్టీ నాయకులు చెప్పాలని ఆయన డిమాండు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ ఎంపీ సీటు, మూడు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. కాపులకు తెలుగుదేశం పార్టీలో ఎంత ప్రాధాన్యత ఉందో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గాజుల మునసుబు, దాసరి బాలసుందరావు, కత్తి నాంచారయ్య, చిలకా కిరణ్, లంక శ్రీనివాసరరావు, పెరవలి ఫిలిఫ్, కంచె వీరబాబు, తోట రామకృష్ణ, చిలకా భాగ్యరావు, చవ్వాకులు సుబ్బయ్య, కొక్కిల గడ్డ ఏసురత్నం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో కాపులకు తీరని అన్యాయం

- వైఎస్సార్ సీపీ నాయకుడు చందు సాంబశివరావు
- వేమూరు మండలం చదలవాడలో ఎన్నికల ప్రచారం



చదలవాడలో ప్రచారం నిర్వహిస్తున్న చందు సాంబశివరావు

చదలవాడ(వేమూరు): తెలుగుదేశం పార్టీలో కాపులను ఎన్నికలకు ఉపయోగించుకొని తర్వాత పట్టించుకోరని వైఎస్సార్ సీపీ నాయకుడు చందు సాంబశివరావు అన్నారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలోని ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఐలో ఉద్యోగం చేసుకొని జీవిస్తుండగా 2004 సార్వత్రిక ఎన్నికల్లో దుగ్గిరాల నియోజకవర్గం నుంచి తనను టీడీపీ నుంచి పోటీ చేయాలని కోరారన్నారు. సహకరించక పోవడంతో అనేక విధాలుగా ఒత్తిడి తీసుకొని వచ్చారన్నారు. అప్పటి ఎన్నికల్లో తాను పోటీ చేసి ఓడిపోవడం జరిగిందని చెప్పారు. అప్పటి నుంచి తెలుగుదేశంలో పదవులు ఇచ్చారు కానీ ప్రాధాన్యత మాత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో జనసేన పార్టీతో పొత్తు పెట్టుకొని ఎమ్మెల్యే సీటు ఇవ్వలేదన్నారు. తెలుగు దేశం పార్టీ గెలుపొందిన తర్వాత కాపులను పక్కన పెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. పవన్‌కల్యాణ్ కుటుంబాన్ని తెలుగు దేశం నాయకులు చేత ఇష్టారాజ్యంగా తిట్టించారన్నారు. 2014లో గుంటూరు జిల్లా కాపులకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కాపులకు 2 ఎంపీ సీట్లు, 20 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిలో 10 సీట్లు జన సేన నాయకులకు ఇచ్చారన్నారు. మిగిలిన 10 సీట్లు తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇవ్వడం జరిగిందన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ కాపులకు 32 ఎమ్మెల్యే సీట్లు, 5 ఎంపీ సీట్లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. కాపులకు తెలుగుదేశం ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందా, వైఎస్సార్ సీపీ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందా కాపు నాయకులు తెలుసుకోవాలని సూచించారు.

2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందని చెప్పారు. పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీకి అధికార పగ్గాలు అప్పగించేందుకు పని చేస్తున్నాడు తప్ప అధికారం కోసం కాదని ఎద్దేవా చేశారు. కాపు నాయకులంతా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, బొల్లిముంత ఏడుకొండలు, బొల్లిముంత శ్రీనివాసరరావు(కెప్టెన్) బొల్లిముంత వెంకటేశ్వరావు, గాజుల మోహన్, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, గాజుల భాను ప్రకాశ్, గాజుల చిన భాను, గోపాలం రాము, కాపు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఆయుధం



2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ శేషన్న



రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు, ఓటర్లు

- మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న
- తెనాలిలో విజయవంతంగా ముగిసిన 2కె రన్

తెనాలిఅర్బన్: ఓటు అనే వజ్రాయుధాన్ని సక్రమంగా ఉపయోగించడం ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవచ్చని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలోని రజక ఐలమ్మ పార్కు వద్ద శనివారం ఉదయం ఏర్పాటు చేసిన 2కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. ఓటును అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ కొత్తగా ఓటు పొందిన యువతీ, యువకులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా ప్రజలకు అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ తమ పవిత్రమైన ఓటును ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని కోరారు. రజక ఐలమ్మ పార్కు నుంచి ప్రారంభమైన 2కె రన్ గాంధీచౌక్, బోసురోడ్డుల మీదుగా చినరావూరులోని పార్కు వరకు కొనసాగింది. అనంతరం అక్కడ ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరూ చేశారు. కార్యక్రమంలో పలువురు సీఐలు, పట్టణ ప్రముఖులు, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక ఐసీయూ వార్డు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో వడ దెబ్బ బాధితుల కోసం ప్రత్యేక జనరల్ మెడిసిన్ ఐసీయూ వార్డును కేటాయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు పడకల వార్డును శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడగాడ్పులు తీవ్రతకు గురైన బాధితుల కోసం ప్రత్యేక వార్డును కేటాయించినట్లు చెప్పారు. వడ దెబ్బకు గురైన బాధితులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వడ దెబ్బకు గురైన వారికి ఎక్కువగా తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. శరీరం కూడా ఎర్రగా మారుతుందని వివరించారు. శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉంటుందని అలాంటి వారు చల్లని ప్రదేశంలోకి వెళ్లాలని ఆయన సూచించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వడ దెబ్బకు గురవుతారని చెప్పారు. అలాంటి వారికి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య సదుపాయాలను అందిస్తామని తెలిపారు. అత్యవసర చికిత్స విభాగానికి రాగానే వారికీ ప్రథమ చికిత్స అందించి అనంతరం వార్డుకు తరలిస్తారని పేర్కొన్నారు. బాధితులు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ముఖ్యంగా వడ దెబ్బకు గురైన వారు చల్లని నీరు తాగాలని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం సమయంలో రోడ్డుపై తిరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో వడ దెబ్బకు గురైన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తారని తెలిపారు. డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక వార్డును కేటాయించినట్లు తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతి నగర్‌లో సీఐ నరేష్ కుమార్ శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. నల్లపాడు పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: రత్నం చారిటబుల్ ట్రస్ట్ తెనాలి ఆధ్వర్యంలో చెంచుపేటలోని ది పవర్ ఆఫ్ హోలీ మైటీ మినిస్ట్రీస్ చర్చిలో శనివారం 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ గేరా పీటర్ మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు దేవరపల్లి టైటాస్, పాస్టర్ జాన్ మోజెస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రక్షణ సువార్త సభలు



తెనాలిరూరల్: పట్టణ రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో పాస్టర్ జి. ఐజక్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రక్షణ సువార్త సభలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ఈ సభలలో చివరి రాత్రి తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాన్ పాల్ పినపాటి వాక్య సందేశం అందించారు. ప్రేమ, కరుణ, శాంతి క్రీస్తు మార్గమని ఆయన చెప్పారు. దైవ సందేశం అందించిన బిషప్‌ను పాస్టర్లు ఈ సందర్భంగా సత్కరించారు. బ్రదర్ ఆనందన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎ. భాను ప్రసాద్, గడ్డం జాన్ బాబు, కోఆర్డినేటర్లు మార్పు స్టీఫెన్, రత్న రాజు, పాస్టర్ గాబ్రియేలు, బ్రదర్ కరుణాకర్, పలువురు దైవ సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలిఅర్బన్: రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మారీసుపేట రెండు గేట్ల మధ్యలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 24వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌వీఎస్ ద్వారా 2017 నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో రెండు చలివేంద్రాలను ప్రతి ఏడాది వేసవి కాలంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం పెదలంక నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వరరావు, వెంకట నాంచారయ్యల సహకారంతో మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ ప్రధాన కార్యదర్శి పెటేటి శ్రీనివాస్, ఫణీదెపు దుర్గ, మోపిదేవి శ్రీనివాస్, శివ రామకృష్ణ, పోతార్లంక శ్రీనివాస్, కొల్లూరు శ్రీనివాస్, సిహెచ్.శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు అలవర్చాలి

విశ్రాంత జిల్లా న్యాయమూర్తి వెంకట రమణ రాయలు



వెంకట రమణ రాయలును సత్కరిస్తున్న మాజేటి ప్రసాద్, హేమాంబ, ఉషశ్రీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే విద్యతో పాటు విలువలు అలవర్చాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.వెంకట రమణ రాయలు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట రమణ రాయలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని కోరారు. విద్యార్థులు సంప్రదాయ నృత్య, నాట్య, నాటక ప్రదర్శనలతో పాటు ఏకపాత్రాభినయం, సంగీత వాయిద్యాలతో తమలోని నైపుణ్యాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధాన కార్యదర్శి పీఆర్కే గోపాలరావు, కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపాల్ హేమాంబ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

బాపట్ల అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



నందాయపాలెంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

కర్లపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని బాపట్ల అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. శనివారం కర్లపాలెం మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను అడిషనల్ డీఎస్పీ, స్థానిక ఎస్ఐ జనార్ధన్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేసుకునే విధంగా అదనపు భద్రత ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజలంతా నిర్భయంగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలన వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- వెల్లటూరులో గౌడ, ఎస్టీ కాలనీల్లో ఆత్మీయ సమావేశాలు



వెల్లటూరులో ఏకలవ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

వెల్లటూరు(భట్టిప్రోలు): అభివృద్ధి చేసి ఓట్లు అడిగేందుకు వస్తున్నామని, సంక్షేమ పాలన అందించిన జగనన్న ప్రభుత్వానికి మరోసారి ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి కోరారు. శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గౌడ, ఎస్టీ కాలనీల్లో తన సోదరి, వదినలతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయని స్థానికులకు వివరించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే స్పందించి నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండే అశోక్‌బాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్తను, ఎంపీగా నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని లాక్ సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ఏకలవ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. గౌడ కాలనీ దాదాపుగా 28 ఏళ్లగా వివక్షతకు గురైందని గ్రామానికి చెందిన మోటూరు చంద్రశేఖరరావు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ఇళ్ల ముందు రోడ్లు వేసుకుని గౌడ కాలనీని పట్టించుకోలేదని వాపోయారు. డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాకాలం మూడు నెలలు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె రాబోయే రోజుల్లో గౌడ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని సమావేశంలో ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు దారావత్ కుమారీభాయ్, వైఎస్సార్ సీపీ నాయకులు, చౌటూరి రవీంద్ర, దావూరి నాగమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోన రఘుపతితోనే బాపట్ల జిల్లా అభివృద్ధి

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఓటేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ కోరారు. మండలంలోని చందోలు గ్రామ సచివాలయ పరిధిలోని కత్తివారిపాలెం గ్రామంలో కోన రఘుపతి తనయుడు నిఖిల్, అల్లుడు అజయ్‌లు పార్టీ నాయకులతో కలిసి మూడవ రోజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా వలంటీర్‌ల ద్వారా సంక్షేమ పథకాలన్నింటినీ గడప వద్దకే అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలంతా దృష్టిలో ఉంచుకుని ఓట్లు వేయాలని కోరారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్ వెస్, ఎంపీటీసీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, చల్లాపల్లి విజయరాజు, మోదుగుల ప్రభాకర్ రెడ్డి, డి.కోటిరెడ్డి, కుంతం ప్రసన్నరాజు, అక్కల మురళీ సముద్రాలరెడ్డి, మండే విజయ్‌కుమార్, బదుగు ప్రకాశరావు, శ్యామల నాగిరెడ్డి, సురేష్ బాబు, కూసంపూడి దేవేంద్రరాజు, గుమ్మడి సీతయ్య తదితరులు ఉన్నారు.

ఆదినారాయణకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ఆదినారాయణ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు ఆరాధ్యుల ఆదినారాయణకు జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని ఊటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఈ గౌరవాన్ని ఆయనకు అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.గోపికన్నన్ అధ్యక్షతన జరిగిన వేడుకలో ముఖ్య అతిథిగా గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్, జర్మనీ సభ్యుడు డాక్టర్ జార్జి ఫ్రూయిండ్ పీటర్ పాల్గొన్నారు. మీడియా డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రాబిన్ రామ్‌మయు హెని, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. 'గానకోకిల' ఏవీ సుబ్బారావు తనయుల్లో ఒకరైన ఆదినారాయణ తండ్రి, సోదరుల బాటలోనే రంగస్థలానికి అంకితమయ్యారు. 1987లో హార్మోనిస్టుగా కెరీర్‌ను ప్రారంభించారు. 1994లో నటుడిగా ఆరంగేట్రం చేశారు. 1997లో శ్రీ దుర్గాభవాని నాట్యమండలితో సొంత సమాజంతో ప్రదర్శనలిస్తూ పౌరాణిక పద్య నాటకానికి ప్రాణం పోస్తున్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, భవానీ శంకరుడు పాత్రల్లో నటిస్తున్నారు. పలు అవార్డులను స్వీకరించారు.

కొనసాగుతున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు



వేదికపై జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు కొనసాగాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలను నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలు రాష్ట్రాల నృత్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రముఖ ఆంధ్ర నాట్య కళాకారుడు సంజయ్ వాడపల్లిని అక్కిరాజు మనీప్రియ స్మారక సాత్రాజితి పురస్కారంతో, భరత నాట్య కళాకారుడు మొయిన్ జిత్‌షా(కలకత్తా), కూచిపూడి నృత్య కళాకారిణి మధువతి కులకర్ణి (బెంగళూరు)లను యువ కళారత్న పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ కవి, చిత్రకారుడు అక్కిరాజు శ్రీహరిబాబు, సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఎర్రగుంట ప్రశాంతి పాల్గొన్నారు.